# రాజకీయ కేయాస్

ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తున్నాను. ప్రపంచంలో అత్యాకాండ పెరిగిపోతున్నది. ఈ డిటెక్టివ్‌లందరూ ఏం చేస్తున్నట్టు? డిటెక్టివ్ భద్రం వెనకటంత ఉత్సాహంగా లేడు.

"లాభం లేదు గురో, డిటెక్టివ్‌లకి గిరాకీ పడిపోయింది" అంటాడు భద్రం.

అంచేతనే అంతకులు మితిమీరిపోతున్నారు. హాశ్చర్యమేం లేదు ఏ పేపరులో విన్నా అత్యల పరంపరే.

"అంతకులింతగా మీరిపోవడానికేమిటి కారణమేమంటావు, భద్రం?" అని ఒకసారి అడిగా.

"కలికాలం గదా, గురూ" అన్నాడు భద్రం.

"మిడతల దండొస్తే పిల్లులకి నోటినిండా పని గదా, అంతకులు సెలరేగితే డిటెక్టివ్‌లు విజురుంభించరేం?" అని అడిగా.

"ఆళ్లంతా యిప్పుడు క్రయిము సినీమాల్లోకెళ్లి పోతున్నారుగా" అన్నాడు భద్రం.

"అవేం సినిమాలు భద్రం?" అడిగా.

"అయేనండీ! డాం డాం ఫిచ్చర్లు!" అన్నాడు భద్రం.

"నువ్వాటిల్లో ఎగస్ట్రా యేషాలేస్తున్నావా?"

"మరి జరగాలిగా, గురూ?"

ఆలోచిస్తున్నాను.

"డిటెక్టివ్‌లనందర్నీ సినిమాల్లోకి తీసుకునే నిరమాతలు నన్ను అడగనేలేదు. ఎందుకంటావు భద్రం?"

"మీకు సినిమాలంటే పడదుగా మరీ?"

ఇది జరిగి శాన్నాళ్లయిందిలే, ఇప్పుడెందుకో ఆమాట గుర్తుకొచ్చి, ఆలోచిస్తున్నా.

ఇంతలో భద్రం వచ్చాడు. రెండు జేబుల్లోంచీ గుప్పిళ్లతో చిల్లర డబ్బులు తీసి చాపమీద పోశాడు.

"ఏంటిది, భద్రం?" అనడిగా.

"డబ్బు గురో! బంగాళాదేశపండు!"

"మనకెట్టా వచ్చిందీ?"

"మనకేటి, గురూ! బంగాళాపండు అడగనాడిది పాపం. ఎవడడిగినా యిస్తారు."

"పండయితే మాత్రం ఇన్ని డబ్బులా?" అన్నాను హాశ్చర్యంగా.

"ఇదేనా? ఇది మన వాటామటుకే. గవర్రై మావ ఇంతకి మూడింతలుంచుకున్నాడు. కుర్రనాయాళ్ల వొంతుట."

ఆలోచిస్తున్నాను.

"చూశావా, భద్రం!"

"ఏంటి, గురో."

"తిరుపద్దేవుడికన్న కూడా ఈ బంగాళా మోతాదు పెద్దదిగా ఉంది కాదూ?"

"అమ్మమ్మా! అలా అంటానికి లేదు. ఆ దేవుడి దెబ్బ ఇంకెవరికీ రాదు. ఆయన ముందు లచ్చలకు లచ్చలు రాల్తాయి. మనవాటాకు వచ్చేది కొంచమే. అంచేత నేవిటంటే నామాలాణ్ని తగ్గించెయటానికి లేదు. అటు సినిమాల్లో, ఇటు రేడియోల్లో, అటు రాజకీయాల్లో, ఇటు పుస్తకాల్లో తిరపద్దేవుడు ఒకటే మోతా! ఆఁ!" అన్నాడు భద్రం.

కొంత నా పొరపాటు కూడా ఉంది. భద్రం జేబులు లావుగా ఉంటే అదంతా పండే అనుకున్నా. కాదు. డబ్బులతో బాటు భద్రం రెండు పొట్లాలు కూడా తీశాడు.

"ఏంటవి, భద్రం?"

"పకోడీలు, గురూ! కొత్త వోటలువి! అంటే కొత్త నూనె అన్నమాట. ఓ వారం రోజులపాటు మా రూచిగా ఉంటాయి. తరవాత మళ్లీ మామూలే."

ఇద్దరమూ పకోడీలు తిన్నాం.

భద్రం పొట్లాం కాగితాలిప్పి "ఇద్దరు నక్సలైట్ల కాల్చివేత" అని చదివాడు.

నాకామాట వెనక విన్నట్టు గుర్తుకొచ్చింది.

ఒకనాడేమయిందంటే, అదేదో కండిషండ్ హాల్లో డాం డాం పిచ్చరుంది చూద్దామన్నాడు. వెళ్లాం. టిక్కట్టులు దొరకలా. అదే కండిషండ్ హాల్లో ఇంకో సినిమా కూడా ఉంటే దానికి పోయి చూశాం.

సినిమా ఏం బాలేదు. అసలు కథ ఉండి చస్తేగా. కాని అందులో ఒక హత్యాశ్చర్యకరమైన సంగతి చూపించారు. మహానగరంలో పబిలీకు రోడ్డుమీద ఆగిన కారులోంచి ఒక పెద్దమనిషిని బయటికీడ్చి అత్యచేశారు.

నాకు చెడ్డకోపం వచ్చి, "డిటెక్టివ్ నాకొడుకులంతా ఏవైనట్టు? పోలీసోళ్లేం చేస్తున్నారు?" అని గట్టిగా అన్నా.

భద్రం నా నోటికి చెయ్యి అడ్డంపెట్టి, రహస్యంగా, "ఆళ్లు నక్సలైట్లులే, గురూ! ఆళ్లు అలాటి పనులు పబిలీగ్గానే చేస్తారు" అన్నాడు.

ఇంటికి వచ్చినాక, "భద్రం నువు నక్సలైట్ల మాట ఏదో చెప్పావు. వాళ్లను గురించి సవిస్తారంగా చెప్పు. డిటెక్టివ్‌గా నిన్ను అడుగుతున్నా" అన్నా.

"ఆళ్లు అంతకులు, గురూ. చంపటమే ఆళ్ల పని! మన మామూలు అంతకుల్లాగా రహస్యం లేదు. క్లూలు లేవు. అంతా బట్టబయలే!"

"మన డిటెక్టివ్‌లు ఆళ్లనెందుకు పట్టరో?"

"రహస్యం లేదు. క్లూలు లేవు! డిటెక్టివ్ చేసేదేంది?"

అదీ నిజమే. కళ్లక్కనపడేదానిని భూతద్దం వేసి చూసే పనేఁవుందీ? అడుగుల గుర్తులుంటే మాత్రం ఏం లాభం?

"అయితే మరి ఈ నస్కల్ లైట్లను చెయ్యటానికేమీ లేదా? వాళ్ల అత్యాకాండ అట్లా జరిగి పోవటమేనా?" అడిగాను.

"అదంతా రాజకీయాల్లే గురూ! ఆళ్లది రాజకీయ అత్యాకాండ పారిటీ అన్నమాట. మిగతా పారిటీలు చూస్తూ వూరుకోవుగా? ఎద్దు మార్కులు ఎలెక్సనుకు నిలబడితే గడ్డిమేట మార్కోడు ఎదురు నిలబడ్డూ? అంటే అత్యాకాండ పారిటీవాళ్లను ఇతర పారిటీలవాళ్లు చంపేస్తారు. దానికీ దానికీ చెల్లూ" అన్నాడు భద్రం.

"అయితే, భద్రం! దేశం నిండా అత్యాకాండ పార్టీలేనంటావా యేం? మరందుకే అత్యాకాండ బలిసిపోతున్నది" అన్నాను.

భద్రం కొంచెం బుర్ర గోక్కుని – "అంతే అనాలి, గురూ! ఒకడేది చేస్తే అందరూ అదే చెయ్యాల. సారా చూడ్రాదూ? ఒకడు వారినీసు తాగి చచ్చాడంటే అదేమైనా తొంభైమంది అదే వారినీసు తాగి చస్తారు. ఒకడెవడో గొట్టాం పాంటూ, పూలరయికా తొడగేస్తాడు. అంతా పొలోమని పూలరైకలతో బస్సులెక్కేస్తారు. ఒకడు బియ్యం ధర పెంచుతాడు. వెంటనే అందరూ అన్నింటి ధరలూ పెంచేస్తారు. బంగాళాపందు చూడ్రాదా! ఒకడు డబ్బాలో డబ్బులేస్తాడు. ఆడి యెక్కువేటని అందరూ వేసేస్తారు! అందులో మంచీ ఉంది, చెడూ ఉంది గురో!"

ఆలోచిస్తున్నాను.

"అయితే, భద్రం? ఈ నస్కల్ లైట్ల అత్యాకాండలో కూడా మంచీ చెడూ ఉందంటావా ఏంటి?"

"ఏదో ఉండే ఉంటుంది గురూ! మనకు రాజకీయాలు తెలవ్వు మరి."

"మనం రాజకీయాలు తెల్చుకోవాలి. భద్రం, చూస్తూ కూచోటం ఏం బాలేదు" అన్నాను.

"శంకరం బాబునడిగితే రాజకీయాలు చెప్పేస్తాడు" అన్నాడు భద్రం.

❀ ❀ ❀ ❀ ❀

"ఏం కేయాస్, ఇలా వచ్చావ్? ఏమిటి విశేషం" అని అడిగాడు శంకరం బాబు.

"గురూగారికి రాజకీయాలు కావాలంట" - అన్నాడు భద్రం.

"చూడు కేయాస్! నువు నీ డిటెక్టివ్ మాలోకంలోనే ఉండు. రాజకీయాలలో దిగకు. అది సుడిగుండం. మహామహ వాళ్లు ఔటైపోతున్నారు. మేటి వస్తాదులు మట్టి కరుస్తున్నారు. నిప్పులు కక్కి చీలిపోయినవాళ్లు పూలమాలలు చేతబట్టుకుని తిరిగి వస్తున్నారు. బీటలుపడిన గోడలు వాటంతట అవే కరుచుకుపోతున్నాయి. రాజకీయాలు తెలుసునని ఎవడన్నా అన్నా నువు నమ్మకు. మాటవరసకి కాంగ్రెసును తీసుకో -"

"నాకు కాంగిరేసు రాజకీయాలు వద్దండీ. ఈ నస్కల్‌లైట్ల రాజకీయాలు కావాలి" అన్నా.

"ఏ లైట్లూ? ఓ అదా! నీకు వాళ్లతో ఏం పనీ?" అనడిగాడు శంకరం బాబు.

"వాళ్లని పట్టెయ్యాలి బాబు. వాళ్లు దారుణ అత్యాకాండ సాగిస్తూంటే నేను ఏం చెయ్యకుండా కూచోవటం ఏం బాగాలేదు" అన్నా.

"వాళ్ల సంగతి పోలీసులూ, సిపాయిలూ చూచుకుంటున్నారుగా."

"బాబుగారూ! డిటెక్టివ్ అయినవాడు నేరం జరక్కముందే అంతకులను పట్టుకోవాలి. అందులోనూ పబిలీగ్గా అత్యాకాండ చేసే నస్కళ్లను ఏ పోలీసైనా కాల్చి పారెయ్యొచ్చు. వీడు నస్కల్‌లైటూ అని ముందుగానే తెలుసుకోవటానికి కులూలు ఏమన్నా ఉంటే చెప్పండి" అన్నాను.

"అదా నీ గొడవ!" అంటూ శంకరంబాబు కాసేపు ఆలోచించి, "నక్సలైట్లు సాధారణంగా కుర్రవాళ్లుగా ఉంటారు. వాళ్లు పేదవాళ్ల పక్షంగా మాట్లాడుతారు. డబ్బున్నవాళ్లని సహించరు. విప్లవం రావాలంటారు. హత్యలు చేస్తారు. దోపిడీలు కూడా చేస్తారు. అయితే ఆ డబ్బుతో ఇళ్లు కట్టుకోరు. దాన్ని తమ పేర బాంకుల్లో కూడా వేసుకోరు. వీలయితే తుపాకులూ, పిస్తోళ్లూ సంపాదిస్తారు. వాళ్లని గొరిల్లాలని కూడా అంటారు. మనుషులను చంపటమూ, డబ్బు దొంగిలించటమూ, తుపాకులు కాజెయ్యటమూ చెయ్యనప్పుడు వాళ్లు విప్లవం గురించీ, ప్రజాశత్రువుల గురించీ మాట్లాడుతుంటారు. అనుభవం వచ్చిన కొద్దీ వాళ్లను నువు సులభంగా గుర్తించగలుగుతావు" అన్నాడు శంకరం బాబు.

ఎందుకన్నా మంచిదని ఆ బాబుచేత ఆ విషయం మళ్లీ మళ్లీ చెప్పించుకున్నాను.

చివరకాయన, "చూడు కేయాస్, నక్సలైట్ల జోలికి పోవటం నిప్పుతో చెలగాటం. డేంజర్" అన్నాడు.

"డిటెక్టివ్‌లకు డేంజరీ లేందెప్పుడు, శంకరం బాబూ?" అన్నాను నిర్లక్ష్యంగా.

❀ ❀ ❀ ❀ ❀

బస్సులో సీటులేక సీట్లలో కూర్చున్నవాళ్ల భుజాలమద ముడ్డి ఆనించి నేనూ, భద్రమూ నిలబడ్డాం. అకస్మాత్తుగా నా చెవులు నిక్కబొడుచుకున్నాయి.

"గ్రామంలో వాళ్లందరినీ బయటికి రప్పించి, ముసలాళ్లనూ, ఆడాళ్లనూ, పిల్లల్నీ కూడా కాల్చిచంపేసేరట. రాక్షసం ముండాకొడుకులు!" అంటున్నారెవరో.

"నక్సల్‌లైట్లే!" అరిచాను.

"ఊరుకో, గురూ. వాళ్లు చెప్పుకొనేది వీత్నాంలో అమెరికా సైనికుల మాట" అన్నాడు భద్రం చిన్నగా.

"అమెరికాలో నక్సళ్లుండరా?" అన్నాను.

"అమెరికాలో నీగ్రోలుంటారు. మనదేశంలో నక్సళ్లను వేటాడినట్టు అమెరికాలో నీగ్రోలను వేటాడుతారు."

బస్సు దిగగానే మా ముందుగా నడుస్తున్న వాళ్లిద్దరు మాట్లాడుకుంటున్నారు.

"విన్నావుటయ్యా, విప్లవకవుల్ని అరెస్టు చేశారుట!"

"అట్లాగా? రోగం వదిలింది."

"ఎవరి రోగమయ్యా? కవుల్ని అరెస్టు చెయ్యటమేమిటయ్యా? పిచ్చి కుదిరింది రోకలి తలకు చుట్టమన్నట్టా? మొన్ననేగా ఆర్భాటంగా లెనిన్ శతజయంతి చేశారూ. లెనిన్ విప్లవకవి కూడా కాదే! విప్లవకారుడేనే?"

"ఇంకో దేశంలో విప్లవం చేస్తే మా బాగంటాం గాని, మన దేశంలో విప్లవం రావాలన్న వాళ్లందర్నీ బొక్కలో తొయ్యాల్సిందే!"

ఇద్దరూ విరగబడి నవ్వారు.

"భద్రం, వాళ్లు నస్కళ్లయి ఉంటారా?" అని అడిగాను.

"కారు గురూ!" అన్నాడు భద్రం తల అడ్డంగా తిప్పి.

రాజకీయాలు తెలుసుకోటమంటే మాటలు కాదు. శంకరం బాబుతో మాట్లాడిన దగ్గర్నించి నాకు ఎక్కడబడితే అక్కడ నస్కళ్లు కనిపిస్తున్నారు. కాని వాళ్లు నస్కళ్లు కారంటాడు భద్రం.

ఒకసారి మీటింగుకు వెళ్లాం. ఒక నల్లని మనిషి అందరిలో మాట్లాడుతున్నాడు. ఆయన నస్కల్ అయి ఉంటాడనుకున్నా.

ఇంకా నయం! ఆయన పాత కాంగిరేసు, అన్నాడు భద్రం.

రోజూ పత్రిక అరువు తెచ్చి భద్రం చేత చదివించుకొని వింటున్నా. నేను నస్కళ్లనుకున్నవాళ్లు ఏ మార్క్సిస్టులో, సోషలిస్టులో అవుతున్నారు. విప్లవం అని ప్రతివాడూ

అనటంతో డిటెక్టివ్ అయిన వాడి పని గడ్డవుతున్నది. మిగిలిన వాళ్లంతా విప్లవం అనటం మానేసి ఒక్క నక్సలైట్లనే ఆ మాట అననిస్తే రాజకీయాలు బాగుపడతై. అందరికీ అర్థమవుతై. కాని ఇదేంటి?

"ఒక్కటే కొండగుర్తు పెట్టుకో, గురూ! ఇంకే రాజకీయపారిటీ వాళ్లు విప్లవం అన్నా, లేనోళ్లను వెనకేసుకొచ్చినా, భూమికి సొరగం రావాలన్నా అవి మనం పట్టించుకోనక్కర్లేదు. అవన్నీ కబుర్లు. ఆటిని నక్సలైట్లు అంటేనే సీరియస్! అప్పుడాళ్లు మనకు దొరికిపోతారు" అన్నాడు భద్రం.

ఈ కొండగుర్తు బాగానే ఉంది.

అయితే ఇది కూడా నాకు పనికిరాకుండా పోయింది.

భద్రం పత్రిక తిరిగేస్తూ ఓ హాశ్చర్యకరమైన విషయం చదివాడు. చోరానగరా, బారానగరా? అక్కడ పోలీసాళ్లు పట్టపగలు ఇళ్లలో జొరబడి ఓ యాభైమంది కుర్రనాయాళ్లను ఇళ్లలోంచి వీథుల్లోకి లాగి, పబిలీగ్గా కాల్చిపారేసి, శవాల్ని అక్కడే వొదిలిపోయారట!

"నక్సల్లు పోలీసు వేషాల్లో వచ్చి ఆ పని చేసుంటారా భద్రం?" అన్నాను.

"అదేం కాదు, గురూ! ఆల్లు అస్సలు పోలీసులే. బంగాళంలో పోలీసులు కనిపించిన కుర్రాళ్లనందరినీ కనిపించినట్టు కాల్చి పారనూకి, ఆ తరవాత ఆల్లు నక్సళ్లా కారా అని చూస్తారు. అంతగా అవసరమైతే డాక్టరు చేత పరీక్ష చేయించి, చచ్చినాల్లు నక్సల్లే అని సరిటిఫికెట్టు తీసుకుంటారు!" అన్నాడు భద్రం.

ఇంక డిటెక్టివ్‌లకు మంచినీల్లు పుట్టేదెట్టా? నాకు మండిపోయింది.

"భద్రం ఇది చాలా ఘోరం. మనం రాజకీయాలు నేర్చుకుని ఏం లాభం? డిటెక్టివ్ జాతికింత అన్యాయం ఎన్నడూ చూడలేదు. నా యెరికలో పోలీసాల్లు, డిటెక్టివ్‌ల కాల్లు పట్టుకుంటేనే గాని అంతకులను పట్టలేకపోయేవాళ్లు. కోర్టులూ, విచారణలూ, సాక్ష్యాలూ, కులూాలు - ఎంతో సరదాగా ఉండేది. ఇప్పుడీడ పోలీసులు మొనగాళ్లయి కూర్చున్నారన్నమాట! ఏ కులూాలు, డిటెక్సనూ లేకుండానే నక్సళ్లను పట్టుకుని రుజూాలు, సాక్ష్యాలూ, విచారణలూ లేకుండా, కనీసం సస్పెన్షనన్నా లేకుండా నక్సల్‌లైట్లను కాల్చిపారేస్తున్నారు! ఇది సయించరానిది! మనం చూస్తూ ఊరుకుంటే లాభం లేదు, భద్రం! లాభం లేదు!" అరిచాను.

*ముద్రణ : వసుధ మాసపత్రిక, దీపావళి ప్రత్యేక సంచిక 1971*